# పడిలేచిన కెరటం



## - గంటి భానుమతి

*(గత సంచిక తరువాయి)*

**"అతనికి ఇదే** మానిక్ డిప్రెషన్. ఈ డిసార్డర్ " అని నా వైపు చూసారు.

డాక్టరుగారి మాటలు నా మీద బాగా పని చేసాయి.అంటే నేను కూడా స్పెషల్ . నా రాతలు,నా గీతలు, నన్ను ఫేమస్ చేస్తాయి. నాలో కొత్త ఉత్సాహం వచ్చేసింది.

"కాని అతను ఈ డిసార్డర్ లో ఓ చెవి కోసాడు. ఒక్కొక్కసారి ఎక్సెంట్రిక్ లా ప్రవర్తించే వాడు, ఈ డిసార్డర్ తో బాధ పడ్డవాళ్ళల్లో కొంత మంది ఆత్మహత్యలు చేసుకున్నారు "

అతని మాటలకి కుంచించుకు పోయాను. నాలో కూడా ఇలాంటి ఫీలింగ్స్ ఉన్నాయి. నేనుకూడా ఆత్మహత్యకి ప్రయత్నించాను! ఈ ఆలోచన నాలో ఓ లాంటి సిక్ ఫీలింగ్ ని కలగ చేసింది. వాంగో ఎందుకలా చేసాడు ? నిస్సహాయంగా ఉన్నప్పుడు చేసి ఉంటాడు, నేను అంతే కదా. అతని బాధని నేను అర్థం చేసుకున్నాను.

" నువ్వు అలా కాదులే. నువ్వు చాలా ధైర్యం కల దానివి. నీకున్న ఈ పది వేళ్ళు నీ స్నేహితులు, ఈ నీ పది మంది ఫ్రెండ్స్ నిన్ను పూర్తిగా ఎంగేజ్ చేస్తారు. క్షణం తీరిక కుండా చేస్తారు. మనసుని ఖాళీగా ఉంచనివ్వరు. నువ్వు చేసే పనిలో పూర్తిగా మునిగి పోతావు. ఇమ్మర్స్ అయిపోతావు. నాకు నీమీద నమ్మకం ఉంది "

ధైర్యం కలదానిని అని అంటూంటే సంతోషం అనిపించింది. నిజమే ఇన్నాళ్ళూ పిరికిదానిలా ఓ గదిలో ఉండిపోయాను. నలుగురితో మాట్లాడడానికే ఇష్టపడలేదు. ఇప్పుడు డాక్టరు గారు అంటూంటే నిజమేనేమో అనిపిస్తోంది. సరే అన్నట్లుగా ,నేను కూడా తల ఊపాను.

నామీద నాకు నమ్మకంఏర్పడుతోంది .డాక్టరు గారి మీద నాకు నమ్మకం ఉంది. నా మీద అతనికి నమ్మకం ఉంది. ఈ నమ్మకం అనేది చాలా అద్భుతమైనది అని డాక్టరు గారికి తెలుసు.

"నీకు నా మీద నమ్మకం ఉంది . దాన్ని నేను వమ్ము చేయదల్చుకోలేదు , నీకు ఇచ్చిన మాటని కూడా నిలబెట్టుకుంటున్నాను. అది ఏంటో తెలుసా "అంటూ నన్ను చూసారు. తెలీదన్నట్లుగా తలని ఊపాను.

" నీకు చదువు. చదవడం, ఇక్కడి నుంచి వెళ్ళే లోగా అన్నీ నేర్పిస్తామని అన్నాను. ఇప్పుడు మనం అదే ఆ విధంగా వెళతున్నాం " డాక్టరుగారి మాటల్ని, డాక్టరు పూర్వి కూడా విన్నారు. క్లాసు సమయం అయిపోవడంతో వాళ్ళిద్దరూ వెళ్ళి పోయారు.

ఆ మర్నాడు డాక్టరుగారు, డాక్టరు పూర్వి తో కలిసి వచ్చారు. వాళ్ళ చేతుల్లో రెండు  సంచులున్నాయి.

“శృతీ,నీకు ఇప్పుడు, కొంచెం ముందుకు వెళ్ళే అవకాశం. మొదటి అడుగు వేయడం కష్టమే కాని వెయ్యక తప్పదు. దానికి డాక్టరు గారు సాయం చేస్తారు. ఇవేళ నువ్వు ఈ సంచుల్లో ఏం ఉందో చూడు. వాటిని చూస్తూంటే నీకు ఉత్సాహం కలుగుతుందని అనుకుంటున్నాము. రేపు ఇందులో ఉన్న వాటి గురించి క్లాసు తీసుకుంటాం” అని కాస్సేపు మాట్లాడి వెళ్ళిపోయారు.

డాక్టర్లంటే ఇలా ఉండాలి. పేషెంటుని మామూలు మనిషిగా చూడాలి. అందుకే ఇక్కడివాళ్ళతో మాట్లాడుతూంటే నాకేదో అయింది, అందుకే నేనిక్కడ ఉన్నానన్న విషయం కూడా గుర్తుండదు.

వాళ్ళు వెళ్ళగానే సంచీలో ఏం ఉందోనని చూసాను. దాన్నిండా పుస్తకాలు.

సంచీలో పుస్తకాలన్నీ ఒక్కొక్కటే తీసి టేబుల్ పైనఅన్నీ కనపడేలా పరిచాను. టేబుల్ నిండి పోయింది. ఒకప్పుడు నా స్టడీ టేబుల్ ఇలాగే ఉండేది. నా టేబుల్ పైన టెంత్, ఇంటర్, ఎంసెట్ ,బిఎస్సీ పుస్తకాలు వాటి నోట్స్ లు, పెన్నులూ, పెన్సిళ్ళూ, బాక్సులూ, పెరేడ్ చేసేవి. అలాంటిది ఇప్పుడు మళ్ళీ పుస్తకాలు. ఎంతో ఉత్సాహంగా కుర్చీ లో కూచుని చూసాను.ఆ రోజంతా అలాగే గడిపేసాను.డాక్టరు గారన్నట్లుగానే నిజంగానే ఎన్నో మర్చిపోయాను.నన్ను నేను కూడా మర్చి పోయాను.

మర్నాడు అంతా ఒక్కొక్క పుస్తకాన్ని తీసి  చూస్తుండి పోయాను. అవి ఏంటో , వాటి మీద ఏం రాసి ఉందో చదవడానికి ప్రయత్నించాను. ఆ అక్షరాలని అతి కష్టం మీద గుర్తు తెచ్చుకున్నాను.

ఆ పేర్లు చదివాకా, ఆ బొమ్మలు అవీ చూస్తూంటేనే అర్థం అయిపోయింది. అన్నీ చిన్నపిల్లల పుస్తకాలు. అన్నీఅమర్ చిత్ర కథ పుస్తకాలు. ఓ వంద వరకూ ఉంటాయేమో. లెక్క పెట్టడానికి అంకెలు కూడా గుర్తు లేదు. అందుకని లెక్క పెట్టలేదు. కానీ చాలా ఉన్నాయి.

## 3

ఒక్కసారి కళ్ళు మూసుకుంది శృతి. గొంతు ఎండిపోయినట్లుగా ఉంది. కళ్ళు తెరిచి పెదవులు నాలుకతో తడుపుకుంది. అది చూసి, మానవ్ వెంటనే లేచి మంచినీళ్ళు, రెండు గ్లాసుల్లో ద్రాక్ష పళ్ల జ్యూస్ తెచ్చి మధ్యన ఉంచాడు.

“ వెళ్ళి పోదామా?“  అని అంది.

“ పూర్తి చేసెయండి. వింటూంటే నాకు ఇది మీ జీవితంలా అనిపించడం లేదు. ఎక్కడో ఎవరికో జరిగిన దాన్ని నాకు చెప్తున్నట్లుగా అనిపిస్తోంది“

శృతి ఏం మాట్లాడ లేదు. చేతికున్న వాచీలో టైము చూసింది.

“బాబోయ్  టైం రెండైంది.మామూలుగా ఆదివారాలు వృద్ధాశ్రమానికి,అనాధాశ్రమానికి వెళ్తాను. అక్కడికి వెళ్తే నన్ను నేను మర్చిపోతాను. వాళ్ళకి పేపరు చదివి వినిపిస్తాను. పిల్లలకి కథలు, అవీ చెప్తాను. పిల్లలకి కథలు ఎంత ముఖ్యమో నాకు బాగా తెలుసు. ఎందుకంటే ఆ ఆనందం నాకు చిన్నప్పుడు దొరకలేదు. పిల్లలు ఓ మంచి కథ వింటే వాళ్ళకి మంచి అంటే ఏంటో చెడు అంటే ఎంటో

తెలుస్తుంది. ఏం చెయ్యకూడదో, ఎందుకు చెయ్య కూడదో తెలుస్తుంది. ఎందుకంటే అందులో నీతి ఉంటుంది. మరి నేను వెళ్తాను. నా కోసం ఎదురు చూస్తూంటారు.“ మరోసారి వాచి చూసుకుంది.

మానవ్ కంగారుగా ఆమెని చూసాడు.

“ అయ్యో అప్పుడేనా, మీరు చెప్పడం ఇంకా పూర్తవలేదు . పూర్తి చేయకుండా ఎలా వెళ్తారు ? పూర్తి చేసెయండి. ఒకే చోట ఇలా కూచోడం విసుగనిపిస్తే ఇక్కడ వద్దనుకుంటే , రిసెప్షన్ లో ఉన్న ఖాళీ సోఫాల్లో కూచుందాం. నేను బిల్ పే చేసి వస్తాను, మీరు వెళ్ళి అక్కడ కూచోండి. అంటూ అక్కడినుంచి వెళ్ళి పోయాడు. శృతి అక్కడి నుంచి కదిలింది.

ఇద్దరూ విశాలంగా ఉన్న ఆ రిసెప్షన్ హాల్లో, రెండు సోఫాల్లో ఎదురెదురుగా కూచున్నారు.

4

టేబుల్ నిండా పుస్తకాలు. అవిచూసాకా మనసులోనే ఏడ్చేసాను. అంతకు ముందు ఉన్న ఉత్సాహం ఎగిరిపోయింది. ఒక్కసారి కుంచించుకు పోయాను. ఎంతో మంచి మంచి క్లాసు పుస్తకాలు, లాంగ్వేజి లో నాన్ డిటెయిల్స్ అవి చదివిన నేను, ఈ లెవెల్ కి వచ్చాను.

కాని ఒక్కటి మాత్రం నిజం. నేను ఇంతకు ముందు ఇలాంటి పుస్తకాలని చూడలేదు. చిన్నప్పుడు చూసే ఉంటాను. కాని పెద్దగా గుర్తు లేదు. ఎందుకంటే మా ఇంట్లో ఇలా కథల పుస్తకాలూ అవి కనిపిస్తే నాన్నగారు చింపి బాయలర్ లో పడేవారు.

రాత్రిళ్ళు పడుకునేప్పుడు అమ్మ కథలు కాకుండా, పుస్తకాల్లోని ప్రశ్నలు ఫార్ములాలు, ఫిల్ ఇన్ ది బ్లాంక్స్ లాంటివి అడిగేది. అలాంటిది ఇప్పుడు ఇవి చూస్తుంటే ఏదో కొత్త ప్రపంచానికి వచ్చినట్లుంది. ఆ బొమ్మలు ,అవీ చూస్తూ అలాగే చాలా సేపుండిపోయాను. ఎంత సేపున్నానో నాకే తెలీదు.

ఆ మర్నాడు ఎప్పటి లాగే రిక్రియేషన్ రూంకెళ్ళాను. అంతకు ముందు నాతో మాట్లాడి తెలుగు నవలల గురించి మాట్లాడిన మనిషి, అదే చోట కూచుని ఉన్నారు. నన్ను చూడగానే పలకరింపుగా నవ్వి, రమ్మన్నట్టు సైగ చేసాడు. వెళ్ళాను. ఈసారి, తెలుగు పుస్తకాల గురించి కాకుండా, నాటకాల గురించి, ఎంతో ఉత్సాహంగా అలా చెప్తూ పోయాడు.

గ్రీకు ట్రాజెడీ, ఇంగ్లీష్ కామెడీ, ఇండియన్ సాఘీకం ఇలా చాలా చెప్పాడు. కర్నాడ్ యయాతి, హయవదన, తుగ్లక్ , అబ్బో అవి ఎంత గొప్ప నాటకాలో మాటల్లేవు, అందుకే , వాటిని చాలా సార్లు చూసాను. కానీ విజయ్ టెండూల్కర్ ఘాషీరామ్ కోత్వాల్ చూసే అవకాశం రాలేదు, కానీ,అతనిదే శాంతతా కోర్ట్ చాలూ ఆహే మాత్రం టీవిలో చూసాను, సులభా దేశ్ పాండే,అరవింద్ దేశ్ పాండే ఇద్దరు కూడా అందులో ఉన్నారు. నాటకాలంటే అవి. ఇలా ఆయన నాటకాల గురించి చెప్తూంటే ఎంతో ఉత్సాహంగా విన్నాను. నాకు నాటకాల గురించి ఏం తెలీదు. అందుకే అతను మాట్లాడుతూంటే అస్సలు విసుగనిపించలేదు. అతను చెప్పే విధానం చూస్తే అతను ఇలా చెప్పడంలో చాలా అనుభం ఉన్నట్లనిపించింది. చాలా విషయాలు తెలుసుకున్నట్లనిపిస్తోంది. అతని పేరు తెలీదు. నాపేరు అతను అడగ లేదు.

అక్కడినుంచి బయటికి వచ్చాను. ఆ పెయింటింగ్స్ గురించి మాట్లాడిన వాళ్ళిద్దరు కనిపించారు.నన్ను చూడగానే దగ్గరికొచ్చారు.

" శృతీ నీకు ఓ పుస్తకం తీసుకొచ్చాం.  పధ్నాలుగు ,పదిహేను ,పదహారు శతాబ్దంలోని పెయింటింగ్ లు అన్నీ ఉన్న ఈ పుస్తకం నీకు నచ్చుతుంది "

ఆ పుస్తకం నా చేతికిచ్చారు. ఇలాంటి అనుభవం ఈ మధ్య కాలంలో జరగలేదు. నామీద ఎంతో అభిమానం చూపిస్తున్నారు. పుస్తకం ఓ సారిచూసాను. అదిచూసి మళ్ళీ నాలో అలజడి. ఒక్కొక్క బొమ్మ అద్భుతంగా ఉంది. దాని గురించిన వివరాలు అన్నీ కూడా ఆ పక్కనే ఉన్నాయి. అలా ఎన్నోఉన్నాయి.

చూసిన వెంటనే చదవలేకపోయాను. ఈ పుస్తకం చదవడం కోసమైనా కష్టపడాలి. అందుకని పైపైనే చూసి,.తలెత్తి వాళ్ళిద్దరిని చూసాను.

మళ్ళీ నువ్వు తిరిగి ఇచ్చెయ్యాలి. ఎందుకంటే ఇది యూరోప్ కి వెళ్ళినప్పుడు మా ఫాదర్ తెచ్చి నాకు ఇచ్చారు. అందుకని "

తను ఎంతో ఇదిగా అపురూపంగా చూసుకున్న దాచుకున్నఆ పుస్తకాన్ని నాకోసారి చూపించాలి, అని మనసులో రావడమే గొప్ప విషయం. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాళ్ళ అభిమానానికి,

అయితే అంతకు ముందు కలిగిన సంతోషం ఎగిరిపోయింది. బొమ్మలు చూడడం అనేది యాంత్రికం, దానికి చదువక్కర్లేదు. మరీ చిన్నపిల్లల్లాగా బొమ్మలు చూస్తే చాలు. చదువు లేకపోయినా చదువు రాకపోయినా పరవాలేదు,  కానీ ఇప్పుడు అలా కాదు. చదువు రావాలి. అదేం బొమ్మో , ఎవరు వేసారో అని తెలియాలి . కానీ ఎలా ? అక్షరాలు గుర్తు పట్టగలిగినా చదవగలనా ? ఈ మధ్య కొన్ని నెలలుగా చదవడమే లేదు. సందేహమే, ఎన్నో మర్చిపోయాను. అందులో అక్షరాలు కూడా ఉన్నాయి, ఈ విషయంలో డాక్టరు గారు కూడా సాయం చేస్తానన్నారు. మళ్ళీ చదువు కొనసాగిస్తానేమో....

ఆ పుస్తకాన్ని ఓ చెట్టు కిందకి తీసుకుని వెళ్ళి తెరిచి , చదవ బోయాను. అక్షరాలు గుర్తొస్తున్నాయి కానీ,అవి ఏంటో తెలీడంలేదు. అందుకే పైకి చదవలేక పోతున్నాను. పరవాలేదు.కొన్ని రోజులు పోయాకా నేను చదవ గలను. దానికి కొంత సమయం పడుతుంది. అందుకని దాన్ని నా గదికెళ్ళాకా టేబుల్ మీద ఓ చోట పెట్టాను..

అనుకోని మార్పులు. నాకు మరో ఇద్దరితో పరిచయం ఏర్పడింది. ఒకరు వయసు దాటిన అతను.  మరొకరు గృహిణి, వాళ్ళిద్దరూ ఎందుకున్నారో నాకు తెలీదు. కాని వాళ్ళతో మాట్లాడుతూంటే బాగానే ఉన్నట్టనిపిస్తూంది. అతను అస్తమానం సైన్సు ,టెక్నాలజీ గురించి మాట్లాడుతూంటే, ఆమె వంటలు ఎలా చెయ్యాలో అందులోకి ఏం వెయ్యాలో విసుగు లేకుండా చెప్తూంటూంది. వాళ్ళకోసం పిల్లలూ, పెద్దలూ, ఎవరో ఒకరు అప్పుడప్పుడు వస్తూంటారు. వాళ్ళ కోసం ఏవేవో తెస్తూంటారు .

ఆ మర్నాడు తోటపని చేసి వస్తూంటే డాక్టరు పూర్వీ దేశాయ్ గారు కనిపించారు

హలో డాక్టర్ అని పలకరించాను.

ఆమె నవ్వింది. "నన్ను పూర్వీ అని పిలు. డాక్టర్ అని పిలుస్తూంటే ఏదో పరాయి గా అనిపిస్తుంది, నువ్వు నాకు బాగా దగ్గర "

నేను చిరునవ్వు నవ్వాను.

"పుస్తకాలు చూసావా? "

నా మొహం మాడిపోయింది. చదవలేక పోయాను.

"చూసాను, బొమ్మలు మాత్రమే చూసాను. చదవడానికి భయపడ్డాను. చదవలేననిపించింది. అందుకే చదవలేదు. కొంచెం ప్రయత్నించాను. కాని " మెల్లిగా అన్నాను.

"పరవా లేదులే శృతీ, ఇందులో నీ తప్పేం లేదు అని మేము ముందరే చెప్పాం కదా, అంత సిగ్గు పడాల్సిందేం లేదు. నేనున్నాను కదా. నిన్ను మామూలుగా చెయ్యడానికి. ఇది నా ఛాలెంజ్ . పద నీ గదికి వెళ్దాం" ఇద్దరం గదిలోకి వచ్చాం. టేబుల్ కి దగ్గర ఉన్న రెండు కుర్చీలని లాగి, ఇద్దరం కూచున్నాం. ఇద్దరం కూడా టేబుల్ మీద ఉన్న పుస్తకాల కేసి చూసాం.

ఒకప్పుడు టేబుల్ పైన పూర్తిగా నా క్లాసు పుస్తకాలు ఉండేవి. అవి నా తెలివికి,నా మేధకి,అద్దం అని అనేవారు. అమ్మ తో అదే అనేవారు. ఇప్పుడు నేను ఆ నేనుని కాను. అన్ని మర్చిపోయిన దాన్ని. మొదటికే వచ్చాను. ఓ చిన్నపిల్లలా ,కొత్తగా స్కూలుకి వెళ్ళడం మొదలు పెట్టిన చిన్న పిల్లలా కుంచించుకు పోయాను. అప్పుడే రాయడం చదవడం నేర్చుకుంటున్న పిల్లని.

చదవగలనా అన్న నాచూపులు అర్థం చేసుకున్నారు అందుకే తప్పకుండా, అని డాక్టరుగారు నా మీద ఎంతో నమ్మకం తో అన్నారు

"నీకు అన్నీ ఇది వరకూ లాగా వచ్చేస్తాయి, ఆ నమ్మకం నాకుంది. ఆ బాధ్యత నాది. నీకు మంచి డాక్టరుని అరేంజ్ చేస్తాను."అని పాల్ గారు అన్నారు, ఆయన అన్నట్లుగానే చేసారు. నేను ఇప్పుడు భయపడి వెనక్కి తగ్గితే ఆయనని అవమానించినట్లు అవుతుంది.

ఇప్పుడు నా వయసు ఇరవై ఒకటికి దగ్గర్లో ఉంది. ఎప్పుడో అప్పుడు ఎక్కడో ఒక చోట నుంచి చదవడం మొదలెట్టాలి. అన్నీ చిన్న పిల్లల పుస్తకాలు. డాక్టరుని ఓసారి చూసి ఓ పుస్తకం తీసుకున్నాను. నా పక్కనే ఉన్న పూర్వి నన్నే చూస్తోంది.

ఇంట్లో ట్యూషన్ చెప్పు కుంటున్నట్లుగా ఉంది. ఓ ట్యూషన్ టీచరు,ఓ స్టూడెంటు కూచున్నట్లుగా కూచున్నాం. పుస్తకం చేతిలో ఉంచుకుని,అక్షరాలని గుర్తు తెచ్చు కుంటున్నాను. ఆఖరికి ఎలాగైతేనేం ఆ పుస్తకం పైన ఉన్న అక్షరాలని కష్టం మీద ఏంటో చదివాను.

అది పెద్ద బాలశిక్ష. ఒక్కసారి నోరు తెరుచుకుని ఆమెని చూసాను. మరోసారి ఆ పుస్తకం కేసి చూసాను. అదేపుస్తకమా ఆ పుస్తకం పేరు సరిగ్గా చదివానా.ఎన్ని సార్లు చూసినా,చదివినా,అది పెద్ద బాలశిక్షే.

అంటే నేను బాలశిక్ష చదివే స్టేజ్ లో ఉన్నానా ? ఇంతగా జారిపోయానా ?

నేను చదివింది కరెక్టే అన్నట్లుగా తల ఊపింది. తరవాతది చదువు, అన్నట్లుగా చేయి ఊపింది. అందులోనే చిన్న చిన్న కథలలున్నాయి. అందులోంచి ఓ కథ చదవమన్నారు. అన్ని అక్షరాలు గుర్తుకువస్తున్నాయి. ఇన్నిరోజులూ ఈ అక్షరాలు ,పదాలూ ఎక్కడ దాగున్నాయో ఏంటో కాని ఇప్పుడు మాత్రం అన్నీ గబ గబా బయటికి వచ్చేస్తున్నాయి. ఓ రెండు వాక్యాలు చదివాను. గుడ్ అని అంటూంటే సంతోషంగా చూసాను. వెంటనే నేనేం చదివానో ఆమె చెప్పమంది. ఒక్కసారి తడబడ్డాను. ఏం చదివాను, ఆలోచించాను. గుర్తు రాలేదు.

" పరవాలేదు , అక్షరాలన్నీ గుర్తున్నాయి, ఇప్పుడు చదవినట్లుగానే చదువుతూ వెళ్ళు " అలాగే అని, చదువుతూ వెళ్ళాను. చదివిన దాన్లో ఒక్కపదం కూడా నా బుర్రలోకి వెళ్ళడం లేదు. ఆగాను. ఏం చదివానో జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించాను. ఫలించలేదు. అయోమయంగా డాక్టరుని చూసాను. ఏం పరవాలేదు అంటూ ఎడమ చేత్తో భుజం తట్టింది. కానీ నాకు పరవా ఉంది. నేను ఎప్పటికీ ఇలాగే ఉంటానా! ఈ చిన్నపుస్తకం, పెద్ద బాలశిక్ష ని అర్థం చేసుకోలేక పోతున్నాను. జ్ఞాపకం పెట్టుకో లేకపోతున్నాను. ఒక్కసారిగా ఏడ్చేసాను.ఆమె అది చూసింది.

"శృతీ నువ్వు చదువుతున్నావు. అంత వరకూ పరవాలేదు.గుర్తుకు రావడం అన్నది, ప్రాక్టీసు మీద వస్తుంది. నువ్వు తీసుకుంటున్న ఈ ఆక్యుపెషనల్ థెరపీ అందుకోసమే. నీకు మెల్లిగా అన్నీ గుర్తొస్తాయి. నీ పూర్తి దినచర్య అంతా మామూలైపోతుంది. కానీ నువ్వు ఇంకా కష్ట పడాలి. ఇప్పుడు నువ్వు ఇందాకా చదివిన ఆ కథలోని మొదటి వాక్యాలని మళ్ళీ చదువు "

అలాగే అన్నాను మళ్ళీ అదే విధంగా అయింది. తెల్లమొహం వేసాను. ఎందుకిలా జరుగుతోంది?

నా బ్రెయిన్ ఏదైనా దెబ్బ తిందా ? ఏదైనా నరాలు పని చేయడం మానేసాయా ?

ఇంతేనా ! జీవితాంతం ఇలాగే ఓ చదువు రాని మొద్దమ్మాయిలా ఉండిపోతానా ? అలా అయితే ఎలా?

ఆమె నా బాధ అర్థం చేసుకున్నట్లుంది,

"ఓ పని చేద్దాం, ఈవేళ్టికి ఇది చాలు ఇక్కడితో ఆపేద్దాం. మళ్ళీ రేపు "

మర్నాడు కూడా అలాగే జరిగింది. చదివింది మళ్ళీ చెప్పలేక పోయాను,

ఈసారి అక్షరాలు గుర్తున్నాయి కాబట్టి ,రాయి.చూద్దాం. అంటూ ఆవిడ ఓ రెండు పదాలని డిక్టేట్ చేసారు. అవి రాయలేక పోయాను.అక్షరాలని చూసి రాసాను . కానీ ఆ రాయడానికి కూడా చాలా సమయం తీసుకున్నాను. ఎందుకంటే దాన్ని చూసి ఎలా రాయాలో ఓ రెండు సార్లు ప్రాక్టీస్ చేసాకా రాసాను. మరో రెండు పదాలు.ఈ సారి కూడా రాసేసాను.

" ఏం రాసావో ఓ సారి చదువు " వెంటనే చదివేసాను. ఎందుకంటే ఏం రాసానో ప్రాక్టీస్ చేసాను కాబట్టి.

"ఇది సరిగ్గా ఉంది.రెండు సార్లు చదవడం కన్నా,ఓ సారి చూసి రాస్తే బాగా గుర్తుంటుంది. ఇప్పుడు అదే జరిగింది, నీ విషయంలో. ఇదే మెథడ్ చిన్న పిల్లలకి స్కూల్లో చెప్తారు. రాస్తే తొందరగా గుర్తు పెట్టుకుంటారని. ఈ సారి ఓ వాక్యం చెప్తాను ,అలాగే రాసెయ్యి " ఉత్సాహంగా తలనూపాను. ఆమె ఓ వాక్యం చెప్పారు. అక్షరాలని చూసి రాసాను. చదువు అంటే చదివేసాను.

" అయితే ఇప్పుడు నువ్వేం రాసావో గుర్తుందా?"ఆలోచించాను. లేదు.

" సరే. మరో సారి రాయి. రాసాను.

"ఇప్పుడు గుర్తుందా..!"

ఆశ్చర్యం. గుర్తుంది.ఎ గిరి గెంతులెయ్యాలనిపించింది. ఆ మాటే ఆవిడతో అన్నాను

“పది సార్లు చదివే కన్నా ఓ రెండు సార్లు రాస్తే గుర్తుంటుంది. అయితే ఇంకా డిక్టేట్ చేస్తాను. అదే ఉత్సాహంతో రాసెయ్యి” అలా ఓ గంట కూచున్నాం. ఒక్క పేజీ రాసాను. అందులో ఉన్నది రాసింది పది వాక్యాలు మాత్రమే.

“శృతీ ఇవేళ్టికి  చాలు.ఇన్ని నెలలు నువ్వు ఒత్తిడికి లోనయ్యావు, నువ్వు చాలా సున్నితమైన దానివి కాబట్టి, ఆ ఒత్తిడిని తట్టుకోలేక పోయావు, చదవ గలిగినా రాయలేకపోయావు. కాస్త కష్టపడ్డాకా చదివినది రాయగలిగావు. తరవాత గుర్తు పెట్టుకోగలిగావు. నువ్వు మామూలుగా అయిపోతావు. నేను రేపు మళ్ళీ వస్తాను” అంటూ ఆవిడ వెళ్ళిపోయారు.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments